క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



టేకుమట్ల: 108లో ప్రసవం కాగా తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ బొమ్మ హరిప్రసాద్ తెలిపారు. హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున చిట్యాల మండలంలోని కాల్వపల్లికి చెందిన మొగిళి రమేశ్ అతడి భార్య సాత్విక పురిటి నొప్పులతో బాధపడుతుందని 108కి కాల్ చేయగా వెంటనే అక్కడికి చేరుకుని వారిని చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో క్రమంలో వెలిశాలకు చేరుకునే సమయంలో బాబు జన్మించాడని, ప్రథమ చికిత్స అందిస్తూ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించినట్లు తెలిపారు. కాల్ చేయగానే సకాలంలో స్పందించి సుఖప్రసవానికి సహకరించిన ఈఎంటీ బొమ్మ హరిప్రసాద్, పైలట్ శేరు రవీందర్‌కు సాత్విక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని గోరికొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన డాక్టర్ నాగబండి విద్యాసాగర్ అతడి తల్లి నాగబండి రామలక్ష్మమ్మ స్మారకార్థం విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో 10జీపీఏ సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసి వారి ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బండి విజేందర్, చైల్డ్‌హెల్ప్‌లైన్ కమిటీ సభ్యుడు దామోదర్, సర్పంచ్ సూదబోయిన రజిత, జోరు సదానందం, నిమ్మల రాజు, నరెడ్ల కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



కాటారం: మహదేవపూర్ మండలం ఎడపల్లిలో ఏర్పాటు చేయనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం కోసం కాటారం మండలం మద్దులపల్లి పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ మంగళవారం విరాళం అందజేశారు. రూ.5వేలను నిర్వహణ కమిటీకి ఇవ్వగా మార్చి 12న నిర్వహించనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని కమిటీ సభ్యులు ఆహ్వానపత్రాన్ని కరుణాకర్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. మహనీయుడు అంబేడ్కర్ అంటే తనకు ఎనలేని గౌరవం అని పే బ్యాక్ టు సొసైటీ ద్వారా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు శ్రీనివాస్, జక్కయ్య, సమ్మయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

మహదేవపూర్: మండలంలోని కుదురుపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీడీఓ శంకర్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. నర్సరీలో మొక్కలను ఏపుగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు వాచర్ల సహాయంతో రెండుమార్లు నీరు పట్టాలని, మొక్కల చుట్టూ పెరిగిన కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసేయాలన్నారు. అనంతరం ఎడపల్లి గ్రామ పంచాయతీలో పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీడీఓతో కుదురుపల్లి పంచాయతీ కార్యదర్శి ఇందిరా, ఎడపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కాటారం: ఆశ్రమ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య మంగళవా రం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వ, ప్రై వేటు పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మార్చి 6 తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అర్హులైన పేద విద్యార్థులకు మండల పరిషత్ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు రుసుము రూ.100 సాయం అందించడం జ రుగుతుందని తెలిపారు. నిరుపేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాబోయ్.. కోతులు

- బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఇంటిపై చేరిన కోతులు

మల్హర్: అడవిలో ఉండాల్సిన వానరాలు గ్రామాల్లో తిరుగుతూ నిత్యం ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయి. వాటి ఆగడాలకు అంతులేకుండా పోయింది. దాదాపు 15 సంవత్సరాల క్రితం కోతులు మండలంలోని పలు గ్రామాల్లో ప్రవేశం జరుగగా రోజురోజుకు వాటి సంఖ్య పెరుగుతోంది. ఇళ్లలోఉన్నా, వీధుల్లోకి వెళ్లిన ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇంట్లో ఉన్నా తప్పనసరిగా తలుపులు మూసి ఉంచాల్సిందే ఆదమరిస్తే అంతే సంగతులు. ఇళ్లలోకి చేరి అందిన పదార్థాలను ఎత్తుకెళ్లి దర్జాగా తీంటున్నాయి. అదిలించేందుకు ప్రయత్నిస్తే మీదపడి గాయాల పాలు చేస్తున్నాయిని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార సముదాయాలలో కూడా దుకాణాల్లోని వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. రోడ్ల పక్కన, తోపుడు బండ్లపై కూరగాయలు, పండ్లు అమ్ముకునే వ్యాపారులు సైతం వీటి భారిన పడి నష్టపోతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు వీధులగుండా తిరగాలంటేనే జంకుతున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించి వాటిని సమీప అడవులలో వదలి కోతుల బెడదను నివారించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కోతుల బెడదను నివారించాలి



కోతుల బెడదతో ప్రతి నిత్యం నరకం అనుభవిస్తున్నాం. ఇళ్లలోకి చొరబడి అందిన పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. అంతే కాకుండా మీద పడి గాయ పరుస్తున్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామంలోని కోతుల బెడదను నివారించాలి.

- సంపత్‌రావు, తాడిచర్ల, మల్హర్

గీత కార్మికులకు అండగా 'తాడి'



కోటంచలో చెక్కు అందజేస్తున్న నాయకులు



చిట్యాల మండలం నవాబుపేటలో..

టేకుమట్ల(రేగొండ): గీత కార్మికులకు తాడి కార్పొరేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్‌గౌడ్ అన్నారు. రేగొండ మండలంలోని కోటంచ గ్రామానికి చెందిన గౌని సాంబయ్యగౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. కాగా మంగళవారం బాధితుడిని ప్రభాకర్‌గౌడ్ పరామర్శించి తాడి కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.15 వేల విలువ గల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంబయ్యగౌడ్ ప్రమాద సంఘటనను సేట్ సోషల్ మీడియా కన్వీనర్ గోపీ మోహన్, తాడి కార్పొరేషన్ చైర్మన్ బుర్ర వెంకటేష్‌గౌడ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్ నుంచి చెక్కు మంజూరు చేపించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పబ్బ శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి క్రాంతికిరణ్, సంపత్ గౌడ్, బుర్ర రమేష్, శ్రీధర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన మాదారపు రవీందర్‌గౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలు పాలయ్యాడు. దీంతో తాడి కార్పొరేషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ.15వేల చెక్కు మంజూరు చేయించారు. కాగా తాడి కార్పొరేషన్ సర్వాయి పాపన్న గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్, సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ రత్నాకర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం రవీందర్ గౌడ్‌కు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పబ్బ శ్రీనివాస్, బుర్ర శ్రీధర్, సర్వ శరత్, బొమ్మ శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొరికిశాల గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మండలంలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించి ఇప్పటికే 5 గ్రామాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి కంటి వెలుగు ఆహ్వాన పత్రిక ఇవ్వడం జరుగుతుందన్నారు. కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, సర్పంచ్ రాములు, వైద్యాధికారిని నాగరాణి, ఉప సర్పంచ్ మొగిలయ్య, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు తెలుసుకునేందుకే పాదయాత్ర



మాట్లాడుతున్న సత్యనారాయణరావు

చిట్యాల: ప్రజల కష్టాలను తెలుసుకుని వారి సమస్యలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిష్కరించే దిశగా కృషి చేసేందుకే హాథ్ సే హాథ్ పాదయాత్రను కొనసాగిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చిట్యాల మండలానికి మంగళవారం రాత్రి వచ్చి మండల కేంద్రంలో బస చేయనునట్లు తెలిపారు. నేడు(బుధవారం) రేగొండ మండలంలోని శ్రీలక్ష్మీనరసింహా స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తాడని తెలిపారు. మండలంలోని చల్లగరిగ, జూకల్ గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకుంటారని పేర్కొన్నారు. అనంతరం తిర్మలాపూర్ గ్రామం నుంచి పాదయాత్రను ప్రారంభించి మండల కేంద్రానికి చేరుకుంటారని తెలిపారు. భోజనం చేసిన అనంతరం చిట్యాల మండల కేంద్రం నుంచి ఏలేటి రామయ్యపల్లి, నవాబుపేట గ్రామాల మీదుగా మొగుళ్లపల్లి మండల కేంద్రం వరకు పాదయాత్ర కొనసాగిస్తాడన్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ ఉంటుందని కార్యకర్తలు, నాయకులు, కార్మికులు, నిరుద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, నాయకులు దబ్బెట రమేష్, మాజీ జెడ్పీటీసీ సమ్మయ్య, కొమురయ్య, ముకిరాల మధువంశీకృష్ణ, మూల శంకర్‌గౌడ్, ఎంపీటీసీ దబ్బెట అనిల్, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొమురు, కుమార్, సతీష్, నాసర్, శ్రీనివాస్, బొట్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా..



పాదయాత్ర నిర్వహిస్తున్న సునీల్‌రెడ్డి, నాయకులు

కాటారం: మంథని ఎమ్మెల్యేగా ప్రజలు ఒక్కసారి ఓటు వేసి అవకాశం కల్పిస్తే అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మంథని గోస-బీజేపీ భరోసా పేరిట సునీల్‌రెడ్డి చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మంగళవారం కాటారం మండలం గంగారంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించి ఇంటింటా తిరిగి ప్రజలను పలకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన రోడ్ షోలో సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. గతం నుంచి ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేగా గెలిచిన వారు ప్రజలను కేవలం ఓట్ల కోసం మాత్రమే వాడుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఏనాడు ప్రజా సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. కౌన్సిలర్లుగా ఎలాంటి అధికారం లేకున్నా ఈ ప్రాంత ప్రజల పక్షాన సమస్యలపై పోరాడుతున్నాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి, మండల ఇన్‌చార్జ్ బండం వసంతరెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, పూసాల రాజేంద్రప్రసాద్, జాడి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

మొగుళ్లపల్లి: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా జేఏసీ కమిటీ తరపున మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి విద్యుత్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఆర్టిజన్ కార్మికులందరికీ పరిమితిలేని వైద్య సదుపాయం కల్పించాలి, పని భారం తగ్గిస్తూ ఆన్ మ్యాన్డ్ కార్మికులతో సబ్ స్టేషన్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కారుణ్య నియామకాల క్రింద గతంలో విద్యార్హతలు బట్టి ఆర్టిజన్ 1, 2, 3గా నియామకపు ఉత్తర్వులు ఇచ్చేవరని ప్రస్తుతం గ్రేడ్-4గా ఉద్యోగాలు ఇస్తామనడం అన్యాయన్నారు. విద్యార్హతలను పరిగణలోకి తీసుకొని కారుణ్య నియామకం కింద ఆర్టిజన్లకు గ్రేడ్- 1, 2, 3గా ఉత్తర్వులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ ఒంటేరు మల్లయ్య జిల్లా కన్వీనర్ నాగుల తిరుపతిరెడ్డి, కో కన్వీనర్లు కోటి సురేందర్, ఉపాధ్యక్షులు తిప్పరపు రాజు కొత్తూరి మధు తదితరులు ఉన్నారు.

మాతృభాష గొప్పతనం ఎనలేనిది



కాటారం: మాతృ భాష ఆకృతిని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

టేకుమట్ల(రేగొండ): మాతృభాష గొప్పతనం ఎనలేనిదని ప్రధానోపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని రామన్నగూడెంతండా ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్ని బాషల్లోకెల్లా తెలుగు భాషా గొప్పదని, కావున మాతృభాష పరిరక్షణకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మాతృభాషలో మాట్లాడడం జన్మహక్కుగా భావించి తెలుగు భాషను పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమ వెంకన్న ఉన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు కూరగాయలతో తయారు చేసిన మాతృభాష ఆకృతి ఎంతగానో ఆకట్టుకుంది. తెలుగు భాషా గొప్పదనాన్ని వివరిస్తూ దీపిక, శిరీష, వర్షిణి, కావేరి, హర్షిత బృందాలు పాటలుపాడారు. ప్రిన్సిపాల్ చల్ల సునీత రచించిన తెలుగు భాష పాటలు, పద్యాలను విద్యార్థులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు పద్మ, విజయ, నళిని, శ్రీలత, రాజేశ్వరీ, లక్ష్మి, జ్యోత్స్న, సహన, శ్రీమాత, రాజమణి, శ్రీవాణిపాల్గొన్నారు.

చిట్యాల: మాతృభాషను కాపాడుకోవాలని హెచ్ఎం శ్రీరాం రఘుపతి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు గడ్డం శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు హెచ్ఎం శ్రీరాం రఘుపతి బహుమతులను అందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమౌళి, విజయ, ఉస్మాన్ అలీ, సదయ్య, రాం నారాయణ, సుజాత బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్ల: మాట్లాడుతున్న కామిడి సతీష్‌రెడ్డి



చిట్యాల: ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థిని

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

భూపాలపల్లి అర్బన్: జేబీసీసీఐ 11వ వేతన సవరణ కమిటీ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం భూపాలపల్లి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఎంఎస్ జాతీయ నాయకులు, జేబీసీసీఐ సభ్యులు మాధవనాయక్ హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బొగ్గు గని కార్మికులకు 11వ వేతన సవరణ కమిటీ సమావేశంలో జరుగుతున్న ఆలస్యాన్ని, ఉదాసీనతను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేతన ఒప్పంద సమావేశం నిర్వహించి 45 రోజులు గడుస్తున్నా మరోసారి నిర్వహించాల్సిన సమావేశం ఏర్పాటు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులకు రావాల్సిన అలవెన్స్, ఇంక్రిమెంట్, సెలవులు ఇతర అంశాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే బీఎంఎస్ ఆధ్వర్యంలో సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భూపాలపల్లి పర్యటనకు వస్తున్న రాష్ట్ర మంత్రి కేటీఆర్ సింగరేణి కార్మికుల సమస్యలపై స్పందించి వారికి ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు అప్పాని శ్రీనివాస్, సుజేందర్, మల్లేష్, సాంబయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, రమేష్, యూసుఫ్, స్వామిలు పాల్గొన్నారు.

విహార యాత్రకు విద్యార్థులు

పలిమెల: మండలంలోని పలిమెల, బుర్గుగూడెంల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంగళవారం రామప్ప, లక్నవరంకు విహారయాత్రకు వెళ్లారు. ఇలాంటి విహార యాత్రలతో విద్యార్థులల్లో విజ్ఞానంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. హెచ్ఎం రవి, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

మొగుళ్లపల్లి: జిల్లా కేంద్రంలో రేపు(గురువారం) నిర్వహించే కేటీఆర్ సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి, శంకుస్థాపన చేయడానికి జిల్లాకు మంత్రి కేటీఆర్ వస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ జోరుక సదయ్య, ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిరావాలి

టేకుమట్ల(రేగొండ): జిల్లా కేంద్రంలో రేపు(గురువారం) నిర్వహించనున్న ఐటీ శాఖామాత్యులు కేటీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రేగొండ మండల ప్రధాన కార్యదర్శి వావిలాల రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

ప్రతిభా పోటీల్లో విద్యార్థికి బహుమతి



బహుమతి అందుకుంటున్న విజ్ఞేష్

మహదేవపూర్: సీవీ రామన్ జయంతి, జాతీయ వైజ్ఞానిక దినోత్సవ సంబురాలుల్లో భాగంగా జిల్లా స్థాయి భౌతిక రసాయన శాస్త్రం-ప్రతిభా పరీక్ష పోటీలు మంగళవారం నిర్వహించారు. కాగా ఈ పోటీల్లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్(బాలుర)లో 9వ తరగతి చదువుతున్న ఆరెందల విఘ్నేష్ మొదటి బహుమతి పొందినట్లు లయన్స్ క్లబ్ మహదేవపూర్ శాఖ ప్రధాన కార్యదర్శి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు మడక మధు తెలిపారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కాళేశ్వరం, మహదేవపూర్ శాఖ అధ్యక్షుడు ఆరుట్ల భాస్కరాచారి సహకారంతో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. తమ పాఠశాలకు ప్రథమ బహుమతి రావడంతో విద్యార్థి విఘ్నేష్‌ను ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

మహాముత్తారం: స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ రెండో భాగంలో చేయాల్సిన పని వివరాల గురించి సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు మండల కేంద్రంలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని డీఆర్‌డీఓ పురుషోత్తం, జెడ్పీటీసీ శారద మంగళవారం ప్రారంభించారు. అనంతరం మొదటిరోజు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా, ఓడీయఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి చేయవల్సిన అంశాలు, అమలు పర్చాల్సిన వివరాలను వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన అంకం స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని చిట్యాల పద్మశాలీ వివర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఈగ కోటి, సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం పరామర్శించి రూ.5000ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సామల రాజేందర్, ఆడిట్ సభ్యులు చిప్ప విశ్వనాథం, క్యాతం మార్కెండయ, కందుల రమేష్, అంకం రమేష్, తదితరులు పాల్గొన్నారు.